## క్లుప్తంగా

### నియామకం



నియామకపత్రం అందుకుంటున్న యర్రదొడ్డి భాస్కర్‌రెడ్డి

కూకట్‌పల్లి: ఓసీ సంఘం వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షుడు కందనూరూ వెంకట సుబ్బారెడ్డి మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా యర్రదొడ్డి భాస్కర్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని ఓసీలలో ఉన్న పేదల కోసం, ఓసీ హక్కుల కోసం అందరిని కలుపుకొని పనిచేస్తా అని అన్నారు. ఈ పదవిలో నియమించినందుకు ఓసీ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### 'మనూ' దూరవిద్య కోర్సులలో ప్రవేశాలు

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ వివిధ దూర విద్యా కోర్సులలో అడ్మిషన్లుకు అవకాశం కల్పిస్తోందని డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రజావుల్లాఖాన్ మంగళవారం తెలిపారు. దూర విద్యా కోర్సులలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులలో ఆన్‌లైన్ అడ్మిషన్లను అందిస్తోందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించడానికి ఆగస్టు 25 చివరి తేదీగా అని తెలిపారు. అడ్మిషన్ ఫీజును ఆగస్టు 31 వరకు చెల్లించవచ్చన్నారు. దూర విద్యా కోర్సులలో ఎంఏ ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్, అరబిక్, హిస్టరీ, ఇస్లామిక్ స్టడీస్, బీఏ, బీకామ్, బీఎస్సీలో ప్రవేశాలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాల కోసం స్టూడెంట్ సపోర్ట్ యూనిట్ (ఎస్ఎస్‌యూ) హెల్ప్‌లైన్ నంబర్లు 040-23008463, 040-23120600 (ఎక్స్‌టెన్షన్ 2207, 2208)ని సంప్రదించాలని కోరారు.

### అక్టోబర్ 11 నుంచి గీతంలో అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌స్‌లోని భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 11-13 తేదీలలో 'ఘనీభవించిన పదార్థ భౌతిక శాస్త్రంలో పురోగతి' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్టు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. పరిశోధనలో భవిష్యత్తు పోకడలపై దృక్పథాన్ని అందిస్తుందని, సంభావ్య సహకారాన్ని పెంపొందించే అవకాశాలను శోధించేలా ఈ సదస్సు ప్రేరేపిస్తుందన్నారు. ఈ సదస్సులో పత్ర సమర్పణ ఆగస్టు 25వ తేదీలోపు చేయొచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఇతర వివరాలకు సదస్సు నిర్వాహకుడు డాక్టర్ ఐవీ సుబ్బారెడ్డి 96181 77690ని సంప్రదించాలని సూచించారు.

### సనత్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సనత్‌నగర్/అమీర్‌పేట: సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో రూ.30 వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ముందుగా సనత్‌నగర్ బస్టాండ్ వద్ద సనత్‌నగర్ మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, జెక్‌కాలనీలోని గాంధీ విగ్రహం, అమీర్‌పేట డివిజన్‌లోని ఎస్ఆర్‌నగర్ ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజావసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. నిరంతరం ఎంతో రద్దీగా ఉండే సనత్‌నగర్ మెయిన్‌రోడ్డుపై వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రోడ్డు విస్తరణ, డివైడర్ నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. అంతేకాకుండా నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రధాన రహదారులతో పాటు బస్తీలు, కాలనీలలోని అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేసి, స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలో ఎక్కడా డ్రైనేజీ లీకేజీలు, డ్రైనేజీ సమస్య, మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్ని కోట్ల నిధులైనా ఖర్చు చేసేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, సరళ, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఫాజిల్, ఖలీల్‌బేగ్, నోమన్, ప్రవీణ్‌రెడ్డి, రాజేష్, కరీంలాలా, జమీర్, జెక్ కాలనీ ప్రతినిధులు కొండ్రాజు సుబ్బరాజు, మల్లు ప్రసాద్, సురేష్‌గౌడ్, కూతురు నర్సింహ, హన్మంతరావు, అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

### క్విట్ ఇండియా ఉద్యమానికి ఎనభై ఏళ్లు

అమీర్‌పేట: క్విట్ ఇండియా ఉద్యమానికి 80 ఏళ్లు పూర్తవుతుందని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన అన్నారు.క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బల్కంపేటలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 1942 ఆగస్టు 8న మహారాష్ట్రలోని ముంబాయిలో క్విట్ ఇండియా ఉద్యమానికి శ్రీకారం చుట్టారని బ్రిటీష్ పాలకులకు ఈ ఉద్యమం ముచ్చెమటలు పట్టించిందని గుర్తు చేశారు.

# 60ఏళ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదేళ్లలో చేశాం

- పాదయాత్రలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బాలానగర్ డివిజన్‌లోని కాలనీల్లో పర్యటన
- రూ.20లక్షలతో పైపులైన్ పనులకు భూమిపూజ



పాదయాత్రలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లో 60 ఏళ్లుగా జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తొమ్మిదేళ్లలో చేశామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే గీతానగర్, వినాయకనగర్, నవజీవన్‌నగర్, దిల్‌కుష్ నగర్, జేపీఆర్‌నగర్‌లలో పాదయాత్ర కొనసాగింది. పాదయాత్రలో ప్రజల వినతిపత్రాలు స్వీకరిస్తూ చిన్న, చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మహిళలు, వృద్ధులు మళ్లీ మీరే అధికారంలోకి రావాలని అంటూ ఆశీర్వదించారు.

**సొంత నిధులతో రోడ్డు వేయించా..**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించామన్నారు. దిల్‌కుష్‌నగర్‌లో ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. అక్కడ రోడ్డు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వంతో పోరాడినా ఫలితం లేకపోవడంతో తన సొంత నిధులతో రోడ్డు వేయించామన్నారు.

**పచ్చదనం పరిరక్షణకు పాటు పడాలి..**

పాదయాత్రలో సాయినగర్ పార్కులో మొక్కలు నాటారు. పచ్చదనం పరిరక్షణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన, స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఇంట మొక్కలు నాటాలని సాయినగర్‌వాసులతో అన్నారు. నవజీవన్‌నగర్‌లో రూ.20లక్షల నిధులతో నిర్మించే తాగునీటి పైపులైన్‌ల నిర్మాణ పనులకు పూజ చేశారు.



సాయినగర్‌లో ఇస్త్రీ చేస్తూ..



సాయినగర్‌లోని పార్కులో మొక్కలు నాటి నీళ్లు పోస్తూ..



పైపులైన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

## 'మేరా భారత్ మహాన్'కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

నిజాంపేట్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మేరా భారత్ మహాన్'కార్యక్రమంలో భాగంగా 'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్'సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆగస్టు 14వ తేదీ ఉదయం 9 – 10 గంటల మధ్య జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో పాల్గొనడానికి సంస్థ వెబ్‌సైట్ https://viswaguruworldrecords.com లోని గూగుల్ ఫామ్‌ను పూరించి సంబంధిత పాఠశాలలు, కళాశాలలు తదితర సంస్థలు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని సంస్థ నిర్వాహకుడు సీఈవో రాంబాబు తెలిపారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా అశోక ధర్మ చక్రంలోని 24 ఆకులు సూచించే 24 విలువల ప్రాముఖ్యం గురించి తెలుసుకోవడంతో పాటు ఆ గుణాలను అలవర్చుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 99599 71679.

## అద్భుతం.. క్విట్ ఇండియా నాటక రూపకం

సుభాష్‌నగర్: భారతదేశానికి స్వాతంత్రం తీసుకురావడానికి మహనీయుల పోరాటపటిమ,చేసిన ఉద్యమాల గురించి నేటి తరానికి చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోలా వెంకటేష్ ముదిరాజ్ అన్నారు.మంగళవారం సూరారంలోని స్కూల్‌లో క్విట్ ఇండియా ఉద్యమం ఎనిమిది దశాబ్దాలు పూర్తి చేసుకున్న క్విట్ ఇండియా డేను నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమం, బ్రిటిష్ వారి పాలన అంతమొందించడానికి 1942లో మహాత్మా గాంధీ ప్రారంభించిన ఉద్యమాన్ని స్మరిస్తూ చిన్నారులు నాటక రూపకంలో ప్రదర్శన చేశారు.



క్విట్ ఇండియా, భారత స్వాతంత్ర పోరాట ఉద్యమాలను నాటకరూపంలో ప్రదర్శిస్తున్న నార్త్ సిటీ హైస్కూల్ విద్యార్థులు

## బాలాజీనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని బీఆర్ఎస్ నేతలు ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందని.. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని బాలాజీనగర్ బీజేపీ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. కొన్ని రోజులుగా డివిజన్ పరిధిలోని మూడో రోడ్డు శివాలయం వద్ద డ్రైనేజీ నీరు ఏరులై పారుతూ రాకపోకలకు ఆటంకం కలుగుతోందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు సమస్యాత్మక ప్రాంతాన్ని వినోద్‌కుమార్‌గౌడ్ బీజేపీ శ్రేణులతో కలసి మంగళవారం పరిశీలించారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సమస్యలకు పరిష్కారం చూపకుండా బీఆర్ఎస్ పార్టీ నేతలు పక్క రాష్ట్రాలపై ఫోకస్ చేయటం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. ఓవైపు భారీ వర్షాలతో హైదరాబాద్ రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. ప్రజా రవాణా ఇబ్బందిగా మారినా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.
- బాలాజీనగర్ డివిజన్‌లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉందన్నారు. ఓటేసిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు మౌనం వహించడం సరికాదన్నారు. థ్యాంక్యూ ఎమ్మెల్యే, థ్యాంక్యూ కార్పొరేటర్ అంటూ వారి ఫోటోలతో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయినాథ్ రెడ్డి, శ్రీనివాస్, రాములు, సూరిబాబు, ప్రేమ్‌కుమార్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్ శివాలయం వద్ద పారుతున్న డ్రైనేజీ వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

## సత్యసాయినగర్‌లో యూజీడీ పనుల పరిశీలన

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని సత్యసాయినగర్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం జలమండలి అధికారి విలియమ్స్‌తో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి నూతన యూజీడీ పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మూసాపేట అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాయకులు మహేష్, మల్లేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని చాకలి బస్తీ, మంగళిబస్తీ, కుమ్మరి బస్తీ, ముదిరాజ్ బస్తీల్లో ప్రజా సమస్యలపై అన్ని విభాగాల అధికారులతో కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ మంగళవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి గ్రామంలో గతంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు వేయాలని అధికారులకు సూచించారు. కొత్త విద్యుత్ స్తంభాలను వేయాలన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, బస్తీ కమిటీ అధ్యక్షుడు ప్రేమకుమార్, రాజు, సాయి, జానకీ, మీనాకుమారి, విజయా, తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి గ్రామంలోని బస్తీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

## పనులను త్వరగా పూర్తి చేయాలి



మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్ రోడ్డు నం.6లో నూతనంగా వేస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, ఏఈ శ్రీనివాస్‌తో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులు, కాంటాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి రాము, మన్మథరావు, సుశీల్‌కుమార్, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

ఎమ్మెల్యే గాంధీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంటమాలజీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



భాగ్యనగర్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ఎంటమాలజీ డిపార్టుమెంట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలని మంగళవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులను, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను సొంత బిడ్డల్లా కడుపులో పెట్టుకొని కాపాడుకుంటున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర సాధనలో ఉద్యోగుల కృషిని గుర్తించి ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని శాఖల ఉద్యోగుల వేతనాలను పెంచి వారి గౌరవానికి తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఎంటమాలజీ శాఖ ఉద్యోగుల సేవలు మరువలేనివని తెలిపారు. ఎంటమాలజీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యను కూడా త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## భక్తిశ్రద్ధలతో మహా కలశాభిషేకం



గూడ్స్ షెడ్ రోడ్డులోని సకంట్ మోచన్ హనుమాన్ మందిర్‌లో మహా కలశాభిషేకంలో పాల్గొన్న మహిళా భక్తులు

మూసాపేట: మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులోని సంకట్ మోచన్ హనుమాన్ మందిర్‌లో మంగళవారం మహా కలశాభిషేకం నిర్వహించారు. ఆశ్రమం గురూజీ శ్రీ మోహన్‌దాస్ స్వామి ఆధ్వర్యంలో 501 కలశాలు, మహిళలతో కలశ యాత్ర జనతానగర్‌లోని హనుమాన్ మందిర్ నుంచి ఐసీడీ వద్ద ఉన్న సంకట మోచన్ హనుమాన్ మందిర్ వరకు అంగరంగ వైభవంగా జరిగింది. జనతానగర్‌లోని ఆలయంలో కలశాలకు అభిషేకం చేసి, ర్యాలీగా వెళ్లి గూడ్స్ షెడ్ రోడ్డులోని ఆయలంలో గల శివునికి అభిషేకం చేశారు. 5 రోజుల పాటు మహా శివ పురాణం పఠనం ఉంటుందని స్వామీజీ తెలిపారు. మూసాపేట కార్పొరేటర్ మహేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పిట్ల మనోహర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్, జిల్లా దళిత నాయకులు యాదగిరి, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎర్రస్వామి, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం

రాయదుర్గం: ప్రమాదంలో గాయపడిన బీజేపీ కార్యకర్త నవీన్ తండ్రి త్రినాథ్‌ను మంగళవారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పరామర్శించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ వద్ద కారు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని ఆయనకు రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గోపన్‌పల్లితండా వడ్డెర సంఘం అధ్యక్షుడు వడ్డెర శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని మహంకాళినగర్‌లో రూ.40లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నిరంజన్, వాసుదేవరావు, పద్మయ్య, వెంకటేశ్వరరావు, రమేష్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును శాలువాతో సన్మానించిన కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో ఉద్యోగులు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ శాలువాతో సన్మానించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన సందర్భంగా కలిశామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఐలయ్య, కార్యదర్శి అశోక్, డిపో చైర్మన్ మురళీ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, డిపో నాయకులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులకు వేతనాల అందజేత



ఉపాధ్యాయులకు వేతనాన్ని అందజేస్తున్న డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ భువన విజయం ప్రాథమిక పాఠశాలలో 159 మంది విద్యార్థులకు ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న కారణంగా బోధనా లక్ష్యాలు సాధించలేకపోవటంతో హెచ్ ఎం మీనా రాజకుమారి అదనంగా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించుకున్నారు. అదే విధంగా తరగతి గదులు, టాయిలెట్స్ శుభ్రం చేసే నిమిత్తం నాగయ్య అనే వ్యక్తిని నియమించారు. వీరికి గాను 2023-24 సంవత్సరానికి ప్రతి నెల వారికి వేతనాన్ని అందించాలని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగాన్ని కోరారు. దీంతో ఆయన అంగీకరించి శ్రీరంగం ఫౌండేషన తరపున ప్రతి నెల వారికి వేతనం అందిస్తున్నారు. జూలైలో వేతనాన్ని సత్యం శ్రీరంగం కార్యాలయంలో అందజేశారు.

## బీబీఏలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పంజగుట్ట: ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తిరుపతి (భారత ప్రభుత్వ టూరిజం మంత్రిత్వ శాఖ అనుబంధం) లో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) ఇన్ కలినరీ ఆర్ట్స్ 3 సంవత్సరాల డిగ్రీ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ పి.చల్లేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కోర్సు కరపత్రాన్ని సెలబ్రిటీ చెఫ్ సంజయ్ తుమ్మతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఇంటర్‌మీడియట్ 50 శాతం మార్కులతో పాస్ అయిన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. సెప్టెంబర్ 1 నుండి క్లాసులు ప్రారంభమౌతాయని ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దేశ విదేశాలకు చెందిన వెరైటీ వంటలు ఇందులో నేర్పుతారని, 100 శాతం ప్లేస్‌మెంట్ ఉంటుందన్నారు. మూడు సంవత్సరాల కోర్సు పూర్తిచేసుకున్న వారికి ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ పట్టా అందిస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు www.icitirupati.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.



కోర్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## సామాజిక శాస్త్రాల మనుగడకు కొత్త ఆవిష్కరణలు చేయాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య

రాయదుర్గం: సామాజిక శాస్త్రాలు ప్రస్తుతం, భవిష్యత్తుతో మనుగడ సాగించాలంటే కొత్త ఆవిష్కరణలు చేయాలని ఉర్దూ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ హెచ్ఆర్‌డీసీ ఆధ్వర్యంలో రాజనీతి శాస్త్రం, పబ్లిక్ అడ్మినస్ట్రేషన్‌లో రిఫ్రెషన్ కోర్సు ప్రారంభోత్సవంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ తత్వశాస్త్రం కంటే పాశ్చాత్య తత్వశాస్త్రం గురించి మనకు ఎక్కువ తెలుసన్నారు. పాశ్చాత్య దేశాలపై ఆధారపడిన భారతీయ సామాజిక శాస్త్ర వ్యవస్థకు భారతీయ బోధనా సంప్రదాయాలపై అవగాహన లేద న్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.